క్లుప్తంగా

సారా రహిత గ్రామాలుగా రూపుదిద్దుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రతీ గ్రామం సారా రహిత గ్రామంగా రూపుదిద్దుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సింహాద్రి అన్నారు. మండలంలోని బొద్దిడి, శ్రీరంగపాడు, లాడ, కొత్తవలస గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సారా నిర్మూలనకు కలసికట్టుగా కృషి చేద్దామంటూ పిలుపునిచ్చారు. హెచ్‌సీ రాంబాబు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: ఐసీడీఎస్ భద్రగిరి ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ ఆయాలు 2, ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు భద్రగిరి సీడీపీఓ రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు దేరువాడ గ్రామంలో అంగన్‌వాడీ ఆయా, బుడ్డెంఖర్జ గ్రామంలో అంగన్‌వాడీ ఆయా, గడివంకధారలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసే వారు వారి యొక్క కులం, నివాసం తదితర ధ్రువపత్రాల నకళ్లను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించి జతపర్చాలని, వాటిని ఏప్రిల్ 4వ తేదీలోగా భద్రగిరి సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానిక వివాహిత అయి ఉండి 2024 జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయం పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో డీఈఈ టీజీకే మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ నిర్వహణ పనులు జరుగుతున్నందున అంపిలి, కొండాపురం అన్నవరం, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

జియ్యమ్మవలస : మండల పరిషత్ కార్యాలయంలో స్వయం ఉపాధి లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉంటుందని ఎంపీడీఓ ఎస్.రమేష్ గురువారం తెలిపారు. జియ్యమ్మవలస ఎస్‌బీఐ, పెదమేరంగి యూనియన్ బ్యాంకు, చినమేరంగి, జియ్యమ్మవలస, తోటపల్లి ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో పరిశీలన ఉంటుందని తెలిపారు. దరఖాస్తుదారులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

తప్పిన ప్రమాదం



షాపులోకి దూసుకెళ్లిన గ్యాస్‌వ్యాన్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి రామాలయం జంక్షన్ వద్ద గ్యాస్ దిమ్మల లోడ్‌తో ఉన్న ఓ వ్యాన్ వెనక్కి తిప్పుతుండగా అదుపు తప్పి పక్కనే ఉన్న ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. అయితే ఈ ఘటనలో ఎవ్వరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు గుర్తించి చేరుకొని వాహనాన్ని బయటకు తీశారు.

సారా నిర్మూలనపై అవగాహన..



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

సీతంపేట: సారా నిర్మూలనపై మండలంలోని మండ కాలనీలో గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ జైభీమ్ మాట్లాడుతూ.. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. అనంతరం గిరిజనులతో ప్రతిజ్ఞ చేయించారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే అపరాధ రుసుం తప్పదని ఏఎస్సై ధర్మారావు అన్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారితో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వారికి, మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన వారికి అపరాధ రుసుం విధించారు.



తనిఖీలు చేపడుతున్న పోలీసులు

● ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..



పాలకొండ మండలం భాసూరు గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఇటీవల పాడవ్వడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. దీంతో విషయాన్ని సర్పంచ్ మల్లీశ్వరమ్మ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాన్స్‌కో అధికారులు గురువారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లైన్ ఇన్‌స్పెక్టర్ బి. జీవరత్నం విద్యుత్ పొదుపుపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురునాయుడు, రమేష్, తదితరులున్నారు. – పాలకొండ రూరల్

● పరామర్శ..

పాలకొండ మండలంలోని చిన మంగళాపురం గ్రామానికి చెందిన యందవ లక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ గురువారం పరామర్శించారు. లక్ష్మి ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, తదితరులు గ్రామానికి చేరుకుని లక్ష్మి కుటుంబ సభ్యులు రమేష్, ఉమాకుమారిలను పరామర్శించి, సంతాపం తెలియజేశారు. పరామర్శలో సర్పంచ్ గోగుల కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు బంకి లక్ష్మణమూర్తి, పాలవలస ధవళేశ్వరరావు, శ్రీనివాసరావులతో పాటు ప్రజాప్రతినిధులు వి.జనార్దనరావు, వి.కొండలరావు, తదితరులున్నారు. – పాలకొండ రూరల్



● ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి



విద్యార్థి దశ నుంచే బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే, తైక్వాండో వంటివి శిక్షణ తీసుకొని ఆత్మరక్షణ చేసుకోవాలని స్థానిక ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బాలికలకు ఆత్మ రక్షణకు సంబంధించి పలు మెలకువలను గురువారం నేర్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా నిలిచేందుకు రాణించాలన్నారు. అందుకు అనుగుణంగా పని చేసిన ప్రదేశాలలోగానీ, బయట బహిరంగ ప్రదేశాల్లోగానీ స్వీయ రక్షణ కోసం ప్రమాదాల నుంచి బయటపడేందుకు కరాటే, తైక్వాండో వంటి విద్యలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. – గరుగుబిల్లి

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం..

- వేసవిలో డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి సరఫరా
- సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఉద్యానవన శాఖాధికారి రాజశ్రీ



డ్రిప్ ఇరిగేషన్‌కు మొగ్గు చూపాలి...

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు విధిగా డ్రిప్ ఇరిగేషన్ వైపు దృష్టి సారించాలి. మొక్కలకు నిరంతరం నీరు అవసరం కాబట్టి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించాలి. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోంది. – పేడాడ జయశ్రీ, హెచ్‌టీఓ, సీతంపేట



డ్రిప్ ఇరిగేషన్‌తో మొక్కలకు నీరు పెడుతున్న రైతు

భామిని: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని ఉద్యానవన శాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రధాన ఆదాయ వనరు కావడంతో రైతులు ఈ పంట సాగుపై ముందుకు వస్తున్నారు. భామిని, సీతంపేట మండలల్లో పామాయిల్ సాగు విస్తరిస్తోంది. ఆయా మండలాల్లో ఈ ఏడాది కొత్తగా 70 ఎకరాల్లో పామాయిల్ సాగు పెరిగిందని సీతంపేట ఉద్యానవన శాఖాధికారి పేడాడ రాజశ్రీ తెలిపారు. దీంతో సాగు విస్తీర్ణం 175 ఎకరాలకు చేరుకుందన్నారు. సస్య రక్షణ చేపడుతూ, అధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు ఖాయమని అధికారి రాజశ్రీ చెబుతున్నారు. వేసవికాలంలో ప్రధానంగా ఏప్రిల్, నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా మొక్కలకు రక్షణ చర్యలు చేపట్టాలి. ఈ నేపథ్యంలో సాగుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు అందించారు.

నీటి యాజమాన్యం..

- వేసవి తీవ్రతకు మొక్కలు నీటి ఎద్దడికి గురికాకుండా అవసరమైన నీటిని అందించాలి. సరైన మోతాదులో నీరు పెట్టకపోతే చెట్ల ఎదుగుదల తగ్గి దిగుబడి తగ్గే అవకాశం ఉంది.
- డ్రిప్ ఇరిగేషన్‌తో వేసవి ఎద్దడి తగ్గించవచ్చు. 90 శాతం సబ్సిడీపై వచ్చే డ్రిప్ ఇరిగేషన్ యంత్రాలను రైతులు తీసుకోవాలి. ప్రతి మొక్కకు రోజుకు 150 నుంచి 200 లీటర్ల నీరు అవసరం.
- మూడేళ్లు దాటిన మొక్కకు 300 నుంచి 350 లీటర్ల నీరు విధిగా అందివ్వాలి.

సస్యరక్షణ..

- ఆయిల్ పామ్ మొక్క నాటిన మూడేళ్ల వరకు ఎలాంటి మగ, ఆడ పూల గుత్తులను ఉంచకుండా తొలగించడాన్ని అబ్లేషన్ అంటారు. ఈ తొలగింపుతో మొక్క మరిన్ని పోషకాలు నిలుపుకుని ఏపుగా పెరుగుతుంది.



పామాయిల్ మొక్క చుట్టూ అబ్లేషన్‌లో చేర్చిన ఎండు కొమ్మలు

- మూడేళ్ల లోపు అంతర పంటగా కీర, కర్బూజ, కూరగాయలు, గోరుచిక్కుడు, బెండ సాగు చేయవచ్చు. జనుము, జీలుగ విత్తనాలు చల్లుకుని పశువులకు మేతగా వాడుకోవచ్చు. లేదా భూమిలో కలియదున్నితే చెట్లకు పోషకాలు అందుతాయి.
- వేసవిలో ఆయిల్ పామ్ చెట్ల చుట్టూ పాదలలో ఎండుగడ్డి లేదా పంట అవశేషాలను మల్చింగ్‌గా ఉపయోగించవచ్చు. తోటలో ఖాళీ గెలలు, గెలల ఫించులు, చెట్టు నుంచి తీసిన వ్యర్థ భాగాలను పాదులలో వేయడం వల్ల తేమ ఆరకుండా ఉండడంతో చెట్లకు ఎరువుగా ఉపయోగపడతాయి.

బిందు సేద్య పద్ధతిలో ఎరువులు..

- బిందు సేద్యం పద్ధతిలో ఎరువులను అందించడాన్ని ఫెర్టిగేషన్ అంటారు. ఈ విధానంలో మొదటి ఏడాది ప్రతి నెలా ఎకరానికి 1.67 కిలోల యూరియా, కిలో డీఏపీ, 1.67 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ అందించాలి.
- రెండో ఏడాది ప్రతి ఎకరానికీ 2.5 కిలోల యూరియా, 1.5 కిలోల డీఏపీ, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అందించాలి.
- మూడో ఏడాది ఏకరానికి 5 కిలోల యూరియా, 3 కిలోల డీఏపీ, 5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.

ఆలయ భూముల పరిరక్షణ బాధ్యత భక్తులదే..



సమీక్షిస్తున్న టీటీడీ ఆలయ కమిటీ సభ్యులు, దాతలు

గరుగుబిల్లి: దశాబ్దాల చరిత్ర కలిగిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత భక్తులందరిపై ఉందని టీటీడీ ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించారు. తోటపల్లి దేవస్థాన ప్రాంగణంలో కమిటీ సభ్యులు, దాతలు, భక్తులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపల్లి ఆలయ నిర్మాణానికి దాతలు ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా.. సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. దేవాలయ ప్రాంగణంలో ప్రైవేటు నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. దేవాలయ ప్రాంగణంలో నిర్మించిన షాపులు అధికారుల ఒత్తిడి మేరకు స్థానికేతరులకు కేటాయించారని, దేవాలయ అక్రమ నిర్మాణాలపై పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో స్థానిక సర్పంచ్ ఆవాల కన్నయ్య, ఎంపీటీసీ ఎన్.సింహాచలం, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు, నాయకులు సత్యంనాయుడు, వెంకటనాయుడు, తాతబాబు, గౌరునాయుడు, పకీరునాయుడు, కిమిడి శ్రీరామ్మూర్తితో పాటు పలువురు పాల్గొన్నారు.

జీడిమామిడికి క్వింటాకు రూ. 20 వేలు ఇవ్వాలి



సచివాలయ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఏపీ జీడిమామిడి రైతుసంఘ నాయకులు

● రైతు సంఘ నాయకులు

పాలకొండ రూరల్: క్వింటా జీడిమామిడికి రూ. 20 వేల మద్దతు ధర కల్పించడంతో పాటు, కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ జీడిమామిడి రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్ఎల్ పురం గ్రామ సచివాలయ సిబ్బందికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కోశాధికారి బొత్స గౌరునాయుడు మాట్లాడుతూ.. పంట చేతికి వచ్చే సమయంలో ధర తగ్గుముఖం పట్టిందన్నారు. దళారులు, వ్యాపారులు ఒక్కటై రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. వరి, గోధుమ, జొన్నపంటల మాదిరి జీడిమామిడి పంటకు కూడా మద్దతు ధర కల్పించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో డి.కుమార్, కూరంగి గౌరునాయుడు, డి.అప్పలనాయుడు, నాగేశ్వరరావు, లక్ష్మంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి. రమణారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోసం చేస్తోందని ఆరోపించారు. దాదాపు అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంతవరకు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని వాపోయారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఏప్రిల్ పదో తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.అలాగే మున్సిపల్ మంత్రికి వినతిపత్రం అందజేస్తామన్నారు.

● ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో వీరఘట్టం పంచాయతీ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

వీరఘట్టం: కొద్ది రోజులుగా మేజర్ పంచాయతీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఖాళీ బిందెలతో గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు వాకాడ ఇందిర మాట్లాడుతూ.. పైప్‌లైన్లు పాడవ్వడంతో చాలా చోట్ల కుళాయిల నుంచి మురుగునీరు వస్తోందన్నారు. పంచాయతీలో పుష్కలంగా నిధులున్నా అభివృద్ధి పనులకు ఎందుకు వినియోగించడం లేదో అర్థం కావడం లేదన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభించి ఇంటింటికి కుళాయిల ద్వారా రక్షిత మంచినీటి అందించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్. సింహాచలం, మహిళలు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో నేరాల నియంత్రణ

భామిని: నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు భామిని వారపు సంత ఫొటోలను గురువారం డ్రోన్ ద్వారా చిత్రీకరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అసాంఘిక కార్యకలాపాలకు డ్రోన్ కెమెరాల ద్వారా చెక్ పెట్టవచ్చన్నారు.

ఘనంగా కైలాసనాథ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన జాయింట్‌వీల్, బ్రేక్‌డ్యాన్స్‌లను ఆస్వాదిస్తున్న ప్రజలు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఉమాసహిత కైలాసనాథ స్వామి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 25 నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఎంటర్‌టైన్‌మెంట్ నిమిత్తం ఏర్పాటు చేసని డ్రాగన్ ట్రైన్, జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, బైక్ రైడింగ్ తదితర వినోద కార్యక్రమాల్లో పరిసర గ్రామాల నుంచి వేలాదిగా ప్రజలు పాల్గొని ఆస్వాదిస్తున్నారు.

మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్విన్‌పేట పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పరీక్షిత్‌రాజు పరామర్శ



రాజేష్ కుటుంబాన్ని పరామర్శించిన పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి నెయ్యిలవీధికి చెందిన మండాది రాజేష్‌తల్లి దుర్గమ్మ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట అల్లు ఈశ్వరరావు, సీలం రామకృష్ణ, కల్యాణ్, సిద్ధాంతం సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

సందర్శన..

సీతంపేట: మండలంలోని కుశిమి, దోనుబాయి పీహెచ్‌సీలను జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) పీవీ సత్యనారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓపీ వివరాలు, మలేరియా పాజిటివ్ కేసులు, రికార్డుల నిర్వహణపై ఆరా తీవారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అంటు వ్యాధుల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

520 మంది హాజరు



అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్న వివిధ బ్యాంక్‌ల సిబ్బంది

వీరఘట్టం: బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయనున్న సబ్సిడీ రుణాలకు సంబంధించి గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 520 మంది హాజరయ్యారని ఎంపీడీఓ బి. వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద యూనిట్లకు గాను 649 మంది దరఖాస్తు చేసుకోగా.. 520 మంది ఇంటర్వ్యూకు వచ్చారని చెప్పారు. అభ్యర్థుల దరఖాస్తులను వివిధబ్యాంక్‌ల సిబ్బంది పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో క్రైస్తవ మహాసభలు

వీరఘట్టం: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం హైస్కూల్ ఆవరణలో క్రైస్తవ మహా సభలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఈ మహాసభలు గురువారంతో ముగిశాయి. కథోలికా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహాసభలకు ఫాదర్ డోమినిక్ స్రావ్యో (కాకినాడ) ముఖ్య అతిథిగా హాజరై క్రీస్తు బోధనలు వినిపించారు. కార్యక్రమంలో స్థానిక వేలంగిణిమాత చర్చి ఫాదర్ జేసుదాస్, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

నాగళ్ల తయారీలో బిజీ



నాగళ్ల తయారీలో వృత్తిదారులు

గరుగుబిల్లి: తెలుగు సంవత్సరాది ఉగాదికి కొత్త నాగళ్లను తయారీ చేసే పనిలో విశ్వబ్రాహ్మణులు బిజీగా ఉన్నారు. ఉగాది ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో రైతులకు అవసరమైన నాగళ్ల తయారీకి డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే మండలంలో గరుగుబిల్లి, చినగుడబ, వల్లరగుడబ, పెద్దూరు, లఖనాపురం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో నాగళ్ల తయారీలో వడ్రంగులు బిజీగా ఉన్నారు. నాగళ్లకు గిరాకీ ఉండడంతో ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయని రైతులు తెలిపారు. గతంలో రూ.600 ఉండే నాగళి ఈ ఏడాది రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు ధర పలుకుతున్నట్టు రైతులు చెప్పారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



స్టాల్ పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని నౌగూడ గ్రామంలో వాసన్ స్వచ్ఛంద సంస్థ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భాగస్వామ్యంతో స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం మిల్లెట్ స్టాల్‌ను పరిశీలించారు.

నిబంధనలు తప్పనిసరి..

వీరఘట్టం: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ వర్తించాలంటే నిబంధనలు పాటించాలని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం తమ సిబ్బందితో కలసి వీరఘట్టం సీబీఎం వీధి లో పర్యటించి పలువురు వినియోదారులతో మాట్లాడారు. ప్రతి నెలా 199 యూనిట్ల విద్యుత్ వాడాలన్నారు. రేషన్ కార్డులలో ఉన్నవారెవరైనా ప్రభుత్వ లేదా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు చేసినా, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్నా విద్యుత్ సబ్సిడీ వర్తించదన్నారు. అలాగే 1.82 ఎకరాల పల్లం భూమి కంటే ఎక్కువ భూమి ఉన్నా.. ఐదెకరాల కంటే ఎక్కువ మెట్టు భూమి ఉన్నా సబ్సిడీకి అనర్హులన్నారు. విద్యుత్ మీటర్ ఎవరి పేరు మీద ఉంటుందో వారు ఒక వేళ చనిపోతే ఆ కుటుంబానికి సబ్సిడీ వర్తించదని.. వెంటనే ఆ చనిపోయిన వారి పేరును తొలగించి కుటుంబ సభ్యుల్లో ఒకరి పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నిబంధనలు పాటిస్తే ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. వీరిలో ఎవరైనా 200 యూనిట్లు దాటి వాడితే సబ్సిడీ వర్తించదని, మొత్తం బిల్లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది ఇప్పిలి తవుడు, మురళీ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శామ్యూల్



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో సహచర న్యాయవాదులు

పాలకొండ/పాలకొండ రూరల్: స్థానిక న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శామ్యూల్ మూర ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది ఉత్తరావల్లి మురళీమోహన్ నేతృత్వంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా అల్లు రఘురాం, కార్యదర్శిగా కె.పద్మలత, సహాయ కార్యదర్శిగా దుప్పాడ ఆనందరావు, కోశాధికారిగా మరిచర్ల జగన్ మోహనరావు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గానికి సభ్యులు, సహ న్యాయవాదులు సీమల కృష్ణారావు, బలగ నరసింహారావు, బొడ్డు రామ్మోహనరావు, తదితరులు అభినందించారు.

కవితల పోటీలకు ఆహ్వానం

పాలకొండ రూరల్:

ఉగాది కవితా పోటీలకు రచయితలను ఆహ్వానిస్తున్నట్లు సూర్యచంద్ర కళాసాహితీ నిర్వాహకుడు బొరోతు శంకరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఔత్సాహిక కవులు, మేధావులు, యువతీ యువకులు, విద్యార్థుల నుంచి పద్య, గద్య కవితలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు శుక్రవారం సాయంత్రం లోగా 94418 06437 నంబర్‌కు వాట్సాప్ ద్వారా కవితలు పంపించాలన్నారు. ఈ నెల 30న స్థానిక ఎలైట్ జూనియర్ కళాశాల వేదికగా సాయంత్రం 4 గంటలకు ఉగాది వేడుకలు, స్వీయ కవితాగాన కార్యక్రమాలు చేపడతామన్నారు.